సాక్షి
విశాఖపట్నం

7

శనివారం । 6 । జూలై । 2024

న్యూస్‌రీల్

వాతావరణ శాఖ అధికారి బదిలీ



సునందరాణి

సాక్షి, విశాఖపట్నం : తుపాను హెచ్చరికల కేంద్రం లోని కీలక అధికారిని బదిలీ చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ వాతావరణ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సునంద రాణిని ఢిల్లీలోని కేంద్ర కార్యాలయానికి బదిలీ చేస్తూ శుక్రవారం జీవో జారీ చేశారు. ఈమె స్థానంలో మరో రెండు రోజుల్లో కొత్త అధికారిని నియమించే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

వాహన చట్టాలపై విద్యార్థులకు అవగాహన



మోటారు వాహన చట్టాలపై ప్రసంగిస్తున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో మోటారు వాహనాల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.వెంకట శేషమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు వినియోగించినప్పుడు అనుసరించాల్సిన నిబంధనలు, చట్టాలను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ చట్టాలు, సైబర్ నేర నిరోధక చట్టాలు, పోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, కంచరపాలెం ఐదో పట్టణ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ దివ్యభారతి, హెచ్‌సీ సుబ్బారావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న సుబ్బిరెడ్డి

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) శాంతి (టెక్నికల్) తెలిపారు. నాలుగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 300 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 106 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 26 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సుబ్బిరెడ్డి, శాంతి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, అధికారులు వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఇంచార్జ్ కమిషనర్‌గా రవీంద్ర

విశాఖ సిటీ: విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా వి.రవీంద్రకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. ఈయన ప్రస్తుతం సంస్థ జాయింట్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం వరకు అప్పటి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వీఎంఆర్‌డీఏకు కమిషనర్ (ఎఫ్ఏసీ)గా కొనసాగారు. అతని బదిలీ అనంతరం ఆ స్థానాన్ని ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. తాజాగా సంస్థ జాయింట్ కమిషనర్‌గా ఉన్న రవీంద్రకే కమిషనర్(ఎఫ్ఏసీ)గా నియమించారు.

సేవలు మెరుగయ్యాయి..

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం : వారం రోజులుగా ప్రజలకు సేవలందించలేక పడకేసిన సచివాలయాలు ఎట్టకేలకు పరుగందుకున్నాయి. ధ్రువపత్రాల జారీ, ఇతర సేవల్లో జాప్యం జరుగుతోందంటూ 'సచివాలయాల్లో సేవలు బంద్.!' శీర్షికతో సాక్షి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరీందర్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఎల్‌డీవో పూర్ణిమాదేవి సచివాలయాలకు సంబంధించిన సర్వర్ పని తీరుపై సమీక్ష నిర్వహించి.. సాంకేతిక లోపాలను సరిదిద్దారు. సర్వర్ పని చేస్తోందని, ప్రతి సచివాలయంలోనూ సేవలు కొనసాగుతున్నాయని, ప్రజలంతా ఎప్పటి మాదిరిగానే.. తమ పరిధిలో ఉన్న సచివాలయాలకు వెళ్లి.. కావల్సిన ధ్రువపత్రాలు, ఇతర పనులకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఏ సమస్య ఉన్నా కాల్ చేయండి

- 24X7 అందుబాటులో ఉంటా
- మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి ఎవరూ ధైర్యం చేయకూడదు
- సిబ్బందికి భరోసా ఇచ్చిన సీపీ శంఖబ్రత బాగ్చి



సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: 'మీ సమస్య అంటే నా సమస్య.. మీరు హాయిగా ఉంటే నేను హాయిగా ఉంటాను' అని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.శంఖబ్రత బాగ్చి పోలీస్ సిబ్బందితో పేర్కొన్నారు. శుక్రవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో సిబ్బంది కవాతును సీపీ పరిశీలించారు.

ఈ సందర్భంగా సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి సారిగా అందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి జిల్లాకు ఏఆర్ ఫోర్స్ ముఖ్యమైన ఆస్తి అని పేర్కొన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏ సమయంలోనైనా లా అండ్ ఆర్డర్ సమస్య ఉన్నప్పుడు, బందోబస్తు అవసరమైనపుడు ఒక ఆయుధంలా పనిచేస్తుందని తెలిపారు. అందుకే అందరూ ఆరోగ్యంగా ఉంటూ, కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, ఉల్లాసంగా ఉండాలని సూచించారు. నేను ఉన్నంత వరకు మిమ్మల్ని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి ధైర్యం చేయకూడదన్నారు. 24 గంటలు విధులు నిర్వర్తించే సిబ్బందికి ఏ ఇబ్బంది రాకూడదని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

సమస్య ఉంటే ఫోన్ చేయండి

ప్రజలతో పాటు సిబ్బందికి కూడా 7995095799 ఫోన్ నంబర్‌లో అందుబాటులో ఉంటానని చెప్పారు. హోంగార్డులు, పీసీలు, హెచ్‌సీలు, ఏఆర్ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, వారి కుటుంబ సభ్యులు అందరూ ఎటువంటి సమస్యలైనా ఆ నంబర్ ద్వారా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తాను సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత అనేక మంది విజిటర్స్‌ను కలవడం జరిగిందన్నారు. అందులో చాలా మంది పారిశ్రామికవేత్తలు సీఎస్ఆర్ కింద పోలీస్ సిబ్బందికి ఉపయోగపడే విధంగా ఏదైనా సంక్షేమాన్ని చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఏఆర్ సిబ్బంది అందరికీ ఉపయోగపడే విధంగా ఏం చేస్తే బాగుంటుందో కాల్ లేదా ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

అలాగే అవసరమైన సమయంలో సెలవు ఇవ్వకపోయినా, మీకు రావాల్సిన బకాయిలు రాకపోయినా, ఏమైనా పెండింగ్‌లో ఉన్నా, డిపోలో ఏ సమస్య ఉన్నా, ఎవరు ఇబ్బంది పెట్టినా తెలియజేయాలన్నారు.

'అతిసార'పై అప్రమత్తం

- జిల్లాలో ప్రబలకుండా ముందస్తు చర్యలు
- రెండు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్
- 2.8 లక్షల మంది చిన్నారుల ఆరోగ్య రక్షణకు చర్యలు



మహారాణిపేట: బాల్యం అతిసార బారిన పడి మృత్యువు అంచులకు చేరువవుతోంది. ముందస్తు జాగ్రత్తలతో అతిసార వ్యాధి నుంచి బయటపడే అవకాశం ఉంది. కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాంతకం కానుంది. జిల్లాల స్థాయిలోనూ ఈ ప్రమాదం పొంచి ఉందని జాతీయ ఆరోగ్య నివేదికలు రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. అతిసార వ్యాధి పట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. బాలల్లో అతిసార మరణాలను పూర్తిగా నివారించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించింది.

గత రెండేళ్లలో సింగిల్ డిజిటే..

జిల్లాలో గత రెండేళ్లలో అతిసార కేసులు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. గత రెండేళ్లలో ఫ్యామిలి డాక్టర్, ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాల పేరిట నేరుగా గ్రామాల్లోనే హెల్త్ డ్రైవ్‌లు నిర్వహించడం, పాఠశాలల్లో ముందస్తుగా విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ చెకప్‌లు నిర్వహించడంతో అతిసార వ్యాధిని పూర్తిస్థాయిలో నియంత్రించగలిగారు.

మూడు దశల్లో ప్రత్యేక డ్రైవ్

స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమం మూడు దశల్లో ఈ నెల 1 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకూ రెండు నెలల పాటు కొనసాగనుంది. ఈ నెల 1- 14వ తేదీ వరకూ తొలి దశ, 15 నుంచి వచ్చే నెల 16 వరకూ రెండో దశ, ఆగస్టు 17- 31వ తేదీ వరకూ మూడో దశగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య శాఖ ప్రచార బాధ్యతలు, అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు చేపడుతుంది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారు.

కంటికి రెప్పలా..

జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,08,163 మంది ఉన్నారు. రెండు నెలల లోపు వయసున్న పిల్లల్లో అతిసార నివారణకు ఎటువంటి ద్రావణాలూ ఇవ్వరు. వారు తల్లిపాల మీద ఆధారపడి ఉండడమే దీనికి కారణం. తల్లిపాలు తాగే బిడ్డకు ఏమీ కాదన్నది శాస్త్రీయ నిరూపణ. రెండు నుంచి ఆరు నెలల మధ్య వయసున్న వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇస్తారు. ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఓఆర్ఎస్ పాటు 20 గ్రాముల జింక్ మాత్రలను 14 రోజుల పాటు ఇస్తారు. అతిసార బారిన పడకుండా చంటి పిల్లల్ని కంటికి రెప్పలా కాచుకోవాలి.

కేసులు నమోదు కాలేదు..



జిల్లాలో ప్రస్తుతం డయేరియా కేసులు నమోదు కాలేదు. ముందస్తుగా స్టాప్ డయేరియా పేరిట రెండు నెలల పాటు ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. ప్రతి గ్రామం, వార్డుల్లో కూడా ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రచారం, అవగాహన కల్పిస్తున్నాం. ముందస్తు చర్యల్లో భాగంగా ఆస్పత్రుల్లో ప్రత్యేక పడకలు ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్ఓ

కొత్త చట్టాలను ఆమోదించిన తీరు సరైంది కాదు

కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్



సింహగిరిపై మాడభూషి శ్రీధర్

సింహాచలం : కొత్తగా నేర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించిన తీరు సరైంది కాదని, తీవ్ర విమర్శలకు గురైందని కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ) ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) అమల్లోకి వచ్చాయన్నారు. అయితే ఈ నేర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించి తీరు తీవ్ర విమర్శలకు గురైందని గుర్తు చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆ చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, పార్లమెంట్ సభ్యులు చర్చ జరపకుండానే ప్రభుత్వం బిల్లులను ఏకపక్షంగా ఆమోదించిందని పిటీషనర్లు పేర్కొన్నారన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలు సేకరించలేదన్నారు. జూలై 1 నుంచి జరిగే నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుందని, ఇది తీవ్ర గందరగోళానికి దారి తీసే ప్రమాదం ఉందన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అలాగే కేసుల నమోదు విషయంలో పోలీసులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు. నిందితులను వీడియో కాల్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయని, కానీ దేశంలో 80శాతం కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. పాత, కొత్త చట్టాలకు సంబంధించిన కేసులు వాదించినపుడు ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలు పరిష్కరించకుండా, చర్చలకు అవకాశం లేకుండా, కోర్టులలో మౌలిక సదుపాయాలు లేకుండా కొత్త చట్టాలు అమలు చేయడం సమంజసం కాదని తెలిపారు.

'కిడ్నీ రాకెట్'పై బిగుస్తున్న ఉచ్చు

- కేసు విచారణ వేగవంతం
- డీసీపీ–1తో పాటు 8 మందితో స్పెషల్ టీం
- ఆదేశాలు జారీ చేసిన సీపీ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార : కిడ్నీ సమకూర్చుతానంటూ మోసం చేసిన కేసులో విశాఖ సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిపై ఉచ్చు బిగుస్తోంది. ఈ కిడ్నీ రాకెట్‌పై నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సీరియస్ అయ్యారు. నిందితులపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. విచారణ వేగవంతం చేయాలని ఇప్పటికే ఆయన ఆదేశాలు జారీ చేశారు. కిడ్నీ రాకెట్ వ్యవహారం నిగ్గు తేల్చేందుకు 8 మందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనికి డీసీపీ–1 బి.లక్ష్మీనారాయణ నాయకత్వం వహిస్తున్నారు. ద్వారకా ఏసీపీ ఎస్.రాంబాబు నేతృత్వంలో సీఐ ఎస్.రమేష్‌తో పాటు పెందుర్తి ఎస్ఐలు ఆశిరి తాత, జె.సురేష్, కానిస్టేబుళ్లు ఆర్.సంతోష్, ఎస్.వాసు, జె.శివ, బి.మహేష్ కేసు దర్యాప్తు చేయనున్నారు.

అసలేం జరిగింది?

బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరాల మేరకు.. పురుషోత్తపురంలోని జి.బ్లాక్ 310, కంఫర్ట్ హోమ్స్‌లో మూలవెంకట సత్యనారాయణ గోపి, భార్య శారదా లక్ష్మి నివాసముంటున్నారు. లక్ష్మి కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించేవారు. 2022 సెప్టెంబర్‌లో జీవన్‌దాన్‌లో కిడ్నీ మార్పిడి ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈలోగా తన భార్య ఆరోగ్యం క్షీణించడంతో సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిని గోపి సంప్రదించారు. వైద్యురాలు వాణికి తన భార్య పరిస్థితిని వివరించారు. కిడ్నీలు మార్చితే ప్రాణాపాయం ఉండదని, కిడ్నీల కోసం ఆస్పత్రి కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించాలని సూచించారు. తన దగ్గర దాతలు అందుబాటులో ఉన్నారని, ప్రక్రియ మొత్తానికి రూ.27లక్షలు ఖర్చు అవుతుందని, ముందుగా రూ.10 లక్షలు ఇవ్వాలని అనిల్.. బాధిత కుటుంబానికి చెప్పారు. దీంతో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో అనిల్ ఖాతాకు దఫదఫాలుగా రూ.10 లక్షలు చెల్లించాడు. రోజులు గడుస్తున్నా కిడ్నీలు ఏర్పాటు చేయకపోగా.. ఫోన్ చేస్తున్నా అనిల్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో బాధిత కుటుంబం మరింత డీలా పడింది. భార్య ఆరోగ్య పరిస్థితి దిగజారడంతో జీవన్‌దాన్ ద్వారా పినాకిల్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి ఉచితంగా నిర్వహించారు. ప్రాణాపాయం నుంచి లక్ష్మి గట్టెక్కడంతో అనిల్ వ్యవహారం తేల్చుకోవాలని గోపి ప్రయత్నించారు. ఎస్ఆర్ఐ నెఫ్రాలజిస్టు వాణిని నిలదీయగా.. కిడ్నీ వ్యవహారంలో తన ప్రమేయం ఏమీ లేదని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఎట్టకేలకు అనిల్ తారసపడడంతో నిలదీయగా.. మీరిచ్చిన రూ.10 లక్షలు ఆస్పత్రి పెద్దలకు ఇచ్చానని.. ఇకపై ఆస్పత్రికి వచ్చి ఆరా తీస్తే ఊరుకునేది లేదని బెదిరించాడు. దీంతో వైద్యురాలు వాణి, ఆస్పత్రి కో–ఆర్డినేటర్ అనిల్ తనను మోసం చేశారని బాధితుడు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర 420 కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు.

'ఇస్కాన్' రథయాత్రకు సర్వం సిద్ధం



రథయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: పూరీ తరహాలో నగరంలోని 'ఇస్కాన్' సాగర్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా రథయాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నగర అధ్యక్షుడు సాంబదాసు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రథయాత్ర వివరాలు వెల్లడించారు. 16 ఏళ్లుగా దిగ్విజయంగా రథయాత్ర నిర్వహిస్తూ వచ్చామని, ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున రథయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రి అనిత పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్టు చెప్పారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు సాగరతీరం వుడా పార్కు నుంచి వైఎంసీఏ, రామకృష్ణ మిషన్, కాళీమాతా ఆలయం మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర అత్యంత వైభవంగా సాగనుందని చెప్పారు. అనంతరం స్వామికి 1008 రకాల వంటకాలతో ప్రసాదం నివేదించడం జరుగుతుందని తెలిపారు. మాతాజీ నితాయి సేవిని మాట్లాడుతూ 1967లో పూరీలో ప్రారంభమైన జగన్నాథస్వామి రథయాత్రను ఇప్పుడు ఇస్కాన్ ఆధ్వర్యంలో 250 దేశాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేయనున్నట్టు చెప్పారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చిన్నారులచే విచిత్ర వేషధారణ, స్వామిని విశేషంగా అలంకరించనున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఇస్కాన్ అర్చకులు, సభ్యులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ సిబ్బందికి అందని జీతాలు

మధురవాడ: వైద్యారోగ్య శాఖ(నేషనల్ హెల్త్ మిషన్)లో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి ఐదో తేదీ దాటినా జీతాలు అందలేదు. రాష్ట్రంలో 186 కేటగిరీల్లో 22 వేల మంది కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ కేటగిరీల్లో పని చేస్తున్నారు. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 1500 మంది పని చేస్తున్నారు. ఇందులో యూపీహెచ్‌సీల్లో చేస్తున్న వారు 600 మంది, టీబీ విభాగంలో 120 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, రుణాలకు సంబంధించి ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం జీతాలు చెల్లించాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీపీ గోపీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వీరబ్రహ్మం డిమాండ్ చేశారు.

మహిళను కాపాడిన జీవీఎంసీ లైఫ్ గార్డులు



మహిళను రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్కే బీచ్‌లో మునిగిపోతున్న మహిళను జీవీఎంసీ లైఫ్‌గార్డులు రక్షించారని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నగరానికి చెందిన సీతమ్మ ఆర్కే బీచ్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, అక్కడ విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ లైఫ్‌గార్డులు కేపీసీ వాసు, ఆనంద్ ఆమెను రక్షించి, కౌన్సెలింగ్ కోసం పోలీసులకు అప్పగించారని తెలిపారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

ఏయూక్యాంపస్: అగ్నివీర్ వాయు స్కీంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి(టెక్నికల్–అన్‌స్కిల్డ్) కె.శాంతి తెలిపారు. జూలై 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 28వ తేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హులైన అభ్యర్థులు www.agnipathvayu. cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

ఏయూక్యాంపస్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని జనాభా అధ్యయన కేంద్రం వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య బి.ముని స్వామి తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు స్టాటస్టిక్స్ విభాగంలో పీటీలు జరుగుతాయన్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో 'జనాభా పోకడలు– సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా పురోగతి' అంశంపై పోటీలు జరుపుతామని. కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు 9849102241 నంబరులో సంప్రదించాలని సూచించారు.

డ్రగ్స్ రవాణా - పిల్లలపై ప్రభావంపై నేడు సమీక్ష

ఎంవీపీకాలనీ: మాదకద్రవ్యాల రవాణా, పిల్లలపై ప్రభావం అంశంపై శనివారం జిల్లా ఉన్నతాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ భవనంలోని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ సమీక్ష సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొననున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, పిల్లలపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ అధికారులతో కలిసి చర్చించనున్నారు.

విశాఖలో 'బుజ్జి' సందడి



విశాఖ వేలీ స్కూల్‌లో 'కల్కి' వాహనం బుజ్జి

ఆరిలోవ : పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన 'కల్కి 2898 AD' సినిమా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ఈ సందర్భంగా 'కల్కి'లో ప్రభాస్ నడిపిన వెహికల్ 'బుజ్జి'ని విశాఖ వేలీ స్కూల్ ప్రదర్శనకు ఉంచారు. శుక్రవారం బుజ్జిని చూసేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. బుజ్జి వాహనాన్ని వైజయంతి మూవీస్ నిర్వాహకులు గురువారం విశాఖ వేలీ స్కూల్‌కు తీసుకొచ్చి ప్రదర్శనకు పెట్టారు. దీనిపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వాహనాన్ని ఏవిధంగా తయారు చేశారు. మెకానికల్ ఇంజినీర్లు ప్రతిభను వివరించారు. దీనిలో ఎలాంటి భాగాలు వాడారు, ఏవిధంగా నడుస్తుంది తెలియజేశారు. బ్యాటరీతో నడిచే ఈ వాహనం తయారీకి రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు సినిమా ప్రొడక్షన్ విభాగం ప్రతినిధి రమేష్ తెలిపారు. విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించడానికి, మన ఇంజినీర్ల ప్రతిభ తెలియజెప్పడానికి ఇక్కడ ప్రదర్శించినట్లు తెలిపారు. స్కూల్ క్రీడా మైదానంలో ఈ వాహనాన్ని నడిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ సూచనలతో ఈ వాహనం చూడడానికి విద్యార్థులను తరగతుల వారిగా ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. వాహనం గురించి వివరించారు. అక్కడ విద్యార్థులకు ఫొటోలు తీశారు. విషయం తెలుసుకొన్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు చేరుకొని ఆ వాహనం వద్ద ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ వైజయంతి మూవీస్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మరింత సుందరంగా విశాఖను తీర్చిదిద్దుదాం



జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావుతో నేవల్ ఆర్మమెంట్ డిపో అధికారులు, ఉద్యోగులు

డాబాగార్డెన్స్: విశాఖ నగర పరిశుభ్రతకు నేవల్ ఆర్మమెంట్ డిపో అధికారులు, ఉద్యోగులు సహకరించి, మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు విజ్ఞప్తి చేశారు. విశాఖలోని నేవల్ ఆర్మమెంట్ డిపో ఐఎన్ఏఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పీజే నివారే ఆహ్వానం మేరకు ఎన్ఏడీలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో నేవల్ అధికారులు, ఉద్యోగులకు విశాఖ నగర స్వచ్ఛతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ విశాఖను మరింత ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దేందుకు ఐఎన్ఏఎస్ అధికారులు, ఉద్యోగులు సహకరించాలని, నగర ప్రజలు, పరిశ్రమలు, అధికారులు, ఉద్యోగులు సుందరీకరణకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2016 యాక్ట్‌ను అనుసరించి పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎకో వైజాగ్ క్యాంపైన్, స్వచ్ఛ సర్వేక్షన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, బీచ్ పరిశుభ్రత తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. విశాఖ నగర స్వచ్ఛతకు సహకరిస్తామని ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ డిపో చీఫ్ జనరల్ మేనేజర్ పీజే నివారే, జనరల్ మేనేజర్ రాజుపాల్ సింగ్, ఇతర అధికారులు తెలిపారు.

20 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు మహిళల అరెస్ట్
- రూ.49 వేలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, చిత్రంలో సీఐ రామకృష్ణ

పెందుర్తి: ముంచంగిపుట్టు నుంచి వరంగల్ ప్రాంతానికి తరలిస్తున్న గంజాయిని పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ బస్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఇద్దరు మహిళలు ఈ గంజాయిని తరలిస్తుండగా.. పక్కా సమాచారంతో పెందుర్తి మండలం పినగాడి వద్ద మాటు వేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయి, రూ.49 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఈ వివరాలను ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి వెల్లడించారు. ఏజెన్సీలో లభ్యమవుతున్న గంజాయిని వరంగల్‌కు తరలించేందుకు అక్కడి ముఠా సభ్యులు ఒప్పందం చేసుకున్నారు. ముంచంగిపుట్టు ప్రాంతంలో సేకరించిన గంజాయిని ఇద్దరు మహిళలు రెండు సంచుల్లో సర్దుకుని ముందుగా నగరానికి తరలించేందుకు.. అక్కడి నుంచి వరంగల్‌కు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో పాడేరులో గంజాయి సంచులతో బస్ ఎక్కారు. అయితే పినగాడి వద్ద బస్‌ను పెందుర్తి పోలీసులు తనిఖీ చేయగా ఆ ఇద్దరు మహిళలు పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. గంజాయి వినియోగం వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఏసీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ గంజాయి సమాచారం ఉన్నా 94407 96008(ఏసీపీ), 94407 96039(సీఐ)కు సమాచారం ఇవ్వాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్‌ఐ సింహాచలం పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


సదస్సులో పాల్గొన్న ఎస్‌డీఐ సీఈవో ఇంతియాజ్

విశాఖ సిటీ: ఏపీ చాంబర్స్–స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో 'స్కిల్లింగ్/అప్‌స్కిల్లింగ్–ఎంప్లాయిబిలిటీ'అనే అంశంపై సదస్సు జరిగింది. పరిశ్రమల సహకారం ద్వారా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యం, పారిశ్రామిక శిక్షణల విలీనం, సానుకూల ప్రవర్తనను పెంపొందించడం తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌డీఐ సీఈవో, సెక్రటరీ ఇంతియాజ్ అర్షద్ ఇన్‌స్టిట్యూట్‌లో అందిస్తున్న వివిధ సౌకర్యాలు, శిక్షణ కార్యక్రమాలను వివరించారు. సభ్యుల నుంచి సలహాలు ఆహ్వానించారు. ఈసీ సభ్యుడు సుధీర్ ములగాడ, మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ గీతా శ్రీకాంత్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లోని శిక్షణ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులతో సంభాషించారు. వారు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ ప్రతినిధి బృందాన్ని కూడా కలిశారు. అనంతరం ఐటాప్ అధ్యక్షురాలు, పాత్ర బీపీవో ఎండీ ఎం.లక్ష్మి విలువైన సూచనలందించారు. ఎస్‌డీఐ అసిస్టెంట్ మేనేజర్ ఎం.హరిప్రియ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో 70 మంది సభ్యులు పాల్గొన్నారు.

జంతు ప్రేమ.. జాగ్రత్త సుమా!



- జంతువుల నుంచి మనుషులకు పొంచి ఉన్న వ్యాధులు
- అప్రమత్తతే శ్రీరామరక్ష
- నేడు వరల్డ్ జూనోసిస్ డే

ఆరిలోవ: మూగజీవాలంటే చాలా మందికి అమితమైన ప్రేమ ఉంటుంది. ఉదయం లేచి దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ వాటితోనే గడుపుతుంటారు. అవి కూడా వారి కుటుంబంలో భాగంగా మారతాయి. అయితే జంతువుల లాలాజలం, తాకిడి, విసర్జకాల ద్వారా అనేక వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయి. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే వరల్డ్ జూనోసిస్ డే ప్రధాన లక్ష్యం. రేబిస్ వ్యాక్సిన్ కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కుక్కకాటు బాధితుడికి మొదటిసారి వ్యాక్సిన్ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ ఏటా జూలై 6న వరల్డ్ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారు.

జూనోసిస్ అంటే...

జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే అసాధారణ ఆరోగ్య స్థితిని వైద్య పరిభాషలో జూనోసిస్ అంటారు. పెంపుడు జంతువులు, సంచార జీవుల నుంచి మనుషులకు అనేక వ్యాప్తి చెందుతాయి. వీటిని సంక్రమిత వ్యాధులు అంటారు. ఏ జంతువుల నుంచి ఏ వ్యాధులు సంక్రమిస్తామో పశు వైద్య విభాగం చినగదిలి మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వివరించారు.

- ఆవులు, గేదెల జాతుల నుంచి ఆంత్రాక్స్, రేబిస్, గాలికుంటు, క్షయ, తామర, మశూచి, క్యూఫీవర్, ఫైలేరియాసిస్ సంక్రమిస్తాయి.
- కుక్కలు, పిల్లుల నుంచి రేబిస్, కాట్ స్క్రాచ్ ఫీవర్, తామర, టాక్సోప్లాస్మోసిస్, లార్వా మైగ్రాన్స్ వ్యాప్తి చెందుతాయి.
- ఎలుకల నుంచి ప్లేగు, లెప్టోస్పైరోసిస్ సంక్రమిస్తాయి.
- పందుల నుంచి మెదడు వాపు, గాలికుంటు, ఇన్‌ఫ్లూయంజా, బ్రూసెల్లోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లాసిస్, హైడాటిడోసిస్ వస్తాయి.
- గొర్రెలు, మేకల వల్ల రేబిస్, ఆంత్రాక్స్, హైడాటి డోసిస్, క్యూ ఫీవర్, ట్రిపన్ సోమియాసిస్ వ్యాప్తి చెందుతాయి.
- గుర్రాల నుంచి ఇన్‌ఫ్లూయంజా, రేబిస్, ఆంత్రాక్స్, తామర, గ్లాండర్స్, లిష్మేనియాసిస్ వ్యాప్తి చెందుతాయి.
- కోళ్లు, పక్షుల వల్ల ఇన్‌ఫ్లూయంజా, తామర, సిట్టకోసిస్, సాల్మొనెల్లోసిస్, లిస్టీరియోసిస్, క్లమీడియోసిస్ అనే వ్యాధులు వస్తాయి.

కుక్క కరిస్తే ఏం చేయాలి?

పిచ్చి కుక్కలు కరవడం వల్ల మనుషులకు, ఇతర జంతువులకు రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. పిచ్చి కుక్క లాలాజలంలో రేబిస్ కారక వైరస్ ఉంటుంది. ఇది కరిచిన మనిషి నరాల్లోకి చేరుతుంది. పశువులకు కరిస్తే బాగా అరుస్తాయి. చొంగ కార్చుతూ తీవ్ర జ్వరానికి గురవుతాయి. మనుషులకు కరిస్తే తీవ్ర జ్వరం వస్తుంది. ఈ లక్షణాలు బయటపడిన 4, 5రోజుల్లో పశువులు మరణిస్తాయి. కుక్క కరిచిన భాగంలో వెంటనే వేడి నీటితో కడగాలి. కరిచిన భాగంపై అయోడిన్ వేయాలి. కుక్క కరిచిన భాగాన్ని బట్టి వైరస్ మెదడుకు చేరడానికి 7 రోజుల నుంచి ఒక సంవత్సరం పడుతుంది. ఈ మధ్య కాలంలో మనిషి మరణించే ప్రమాదం ఉంది. అందుకే కుక్క మనిషిని కరిచిన వెంటనే రేబిస్ టీకా వేయించుకోవాలి. కుక్క కరిచినప్పటి నుంచి నెల రోజుల్లో తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ ఐదు డోసులు వేయాల్సి ఉంటుంది. కుక్కలు టీకాలు వేయిస్తే.. అవి మనుషులకు కరిచినా ఎలాంటి ప్రమాదం ఉండదు.

అప్రమత్తత అవసరం

మనుషుల వల్ల మూగజీవాలకు కూడా హాని జరుగుతుందని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. సుమారు 200 రకాల వ్యాధులు మనుషుల నుంచి మూగజీవాలకు వ్యాప్తి చెందుతాయని చెబుతున్నారు. ఈ స్థితిని వైద్య పరిభాషలో రివర్స్ జూనోటిక్ డిసీజ్ ట్రాన్స్ మిషన్ అని, జూ ఆంత్రో పోనోసిస్ అంటారన్నారు. జూనోసిస్ రిస్క్ అధికంగా ఉన్న వర్గాలను వైద్యులు గుర్తించి జాగ్రత్తలు సూచిస్తున్నారు. గర్భిణులు, ఐదేళ్ల కంటే చిన్న, 65 ఏళ్ల కంటే పెద్దవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కీమోథెరపీ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎక్కువగా వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారు. జంతువులు కరవడం, గోళ్ల ద్వారా గాయం కావడం, వాటి తుంపర్ల ద్వారా, ఆహారాన్ని పంచుకోవడం, రోగాల బారిన పడిన జంతువులను తాకడం, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమిస్తాయని వివరించారు.

అవగాహన కల్పిస్తున్నాం



జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరం. జంతువులు నుంచి జంతువులకు, మనుషులకు వ్యాపించే వ్యాధులనే జూనోసిస్ వ్యాధులంటాం. ఇవి 150 వ్యాధుల వరకు ఉంటాయి. జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నాం. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేస్తాం. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాసరావు, ఏడీ, పశు సంవర్ధక శాఖ, చినగదిలి మండలం

8న కిరండూల్ స్పెషల్ రద్దు



తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఈ నెల 8న విశాఖపట్నం–కిరండూల్(08551) స్పెషల్, 9న కిరండూల్–విశాఖపట్నం (08552) స్పెషల్‌ను రద్దు చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. షాలిమర్– చెన్నై సెంట్రల్(128410) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 5.20 గంటలకు, హౌరా–మైసూరు(22817) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.10 గంటలకు, సిల్చార్–త్రివేండ్రం సెంట్రల్ (12508) ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రాత్రి 7.50 గంటలకు బయలుదేరాయి.

నగరంలో నేడు

- ఉదయం 9 గంటలకు ఆశీలమెట్ట వైఎస్సార్ సీపీ సౌత్ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమ నిర్వహణ కోసం సమావేశం
- 10 గంటలకు ఎంవీపీ కాలనీ డీఆర్‌డీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల సమావేశం
- 10 గంటలకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆచార్య మాడభూషి శ్రీధర్ రచన భారత రాజ్యాంగ పీఠిక పుస్తక పరిచయ సభ
- 10.30 గంటలకు ఎండాడ లా కాలేజీ రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం

పకడ్బందీగా రథయాత్ర ఏర్పాట్లు


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జగన్నాథ స్వామి రథ యాత్రకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర డాక్టర శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. ఆదివారం రథయాత్ర ఏర్పాట్లపై సీపీ తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. టౌన్ కొత్త రోడ్డులో గతంలో జరిగిన పలు జగన్నాథస్వామి రథయాత్ర సంబంధిత డ్రోన్ వీడియోలను పరిశీలించారు. రథయాత్రకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే ట్రాఫిక్ స్తంభించకుండా ప్రణాళికాబద్ధం ఏర్పాట్లు చేయాలన్నారు. రథయాత్ర జరిగే ప్రాంతంలో పూర్తిస్థాయిలో లైటింగ్ ఉండేలా చూడాలని సూచించారు. అవసరమైన వాహనాలకు గుర్తింపు పాస్‌లు ఇవ్వాలని, ఎటువంటి తోపులాటలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, రథయాత్రను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 బి.లక్ష్మీనారాయణ, డీసీపీ (క్రైం) పి.వెంకటరత్నం, నగర ట్రాఫిక్ ఉన్నతాధికారులు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యుడి పొరపాటు.. రూ.50వేల మూల్యం

- బాధితురాలికి చేరని నగదు?

తగరపువలస: ట్యూబెక్టమీలో ఓ వైద్యుడు చేసిన చిన్న పొరపాటుకు.. ఈ ఘటనకు ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు ఆ వైద్యుడిని బెదిరించి రూ.50 వేలు వసూలు చేశారు. భీమిలి మండలం తాళ్లవలసలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని ఇసుకతోటకు చెందిన మైనపు శ్రావణికి గురువారం తాళ్లవలస పీహెచ్‌సీలో ట్యూబెక్టమీ శస్త్రచికిత్స జరిగింది. భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన వైద్యుడు ఫణికుమార్ ఈ ఆపరేషన్ చేశారు. ఆ సమయంలో చిన్న పొరపాటు కారణంగా ఆమె పిత్తాశయానికి సెంటీమీటర్ గాయం అయింది. వెంటనే ఆ గాయానికి కుట్లు వేసి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. తర్వాత ఇక్కడి వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు మెరుగైన వైద్యం అందుతుండటంతో ప్రస్తుతం శ్రావణి సురక్షితంగా ఉన్నట్టు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు కూడా శ్రావణి ఆరోగ్యంగానే ఉన్నట్టు తెలిపారు. కాగా.. పీహెచ్‌సీ వద్ద శుక్రవారం బాధితురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. దీనిని ఆసరాగా తీసుకుని మధురవాడకు చెందిన కొందరు వ్యక్తులు ఆస్పత్రి వద్ద కొంత గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించారు. తరువాత ఆపరేషన్ చేసిన వైద్యుడిని ఫోన్‌లో బెదిరించి.. బాధితులకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి మధురవాడకు చెందిన ఓ ప్రభుత్వ వైద్యురాలు మధ్యవర్తిత్వం వహించి రూ.50 వేలు ఇప్పించడంతో శాంతించారు. జిల్లా వైద్యశాఖాధికారులకు తెలిస్తే ఉద్యోగానికి ప్రమాదమని వారు వైద్యుడిని బెదిరించినట్లు తెలిసింది. తీరా ఆ వైద్యుని నుంచి తీసుకున్న డబ్బులు బాధిత కుటుంబానికి చేరలేదని సమాచారం.

మందుబాబులకు రూ.18.66 లక్షల జరిమానా

పీఎంపాలెం: పీఎంపాలెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఆరు నెలల్లో 33,677 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. మద్యం సేవించి బైక్‌లు నడుపుతున్న 932 మందిపై కేసులు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. వీరికి న్యాయస్థానం రూ.18,66,600 జరిమానా విధించిందని వెల్లడించారు. అలాగే ట్రాఫిక్ ఉల్లంఘించిన వారికి రూ.1,07,125లు జరిమానా విధించామన్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. అతని వయసు 35 ఏళ్లు ఉంటాయని, 5.4 అడుగులు ఎత్తు, చామనచాయ రంగులో ఉన్నట్లు పేర్కొన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీరావు కోరారు.

రెవెన్యూ అధికారుల వింత ధోరణి


అక్రమ నిర్మాణాలను పాక్షికంగా తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది: ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే రెవెన్యూ అధికారులు వాటిని పూర్తి స్థాయిలో తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పిస్తారు. కానీ భీమిలి జోన్‌లో మాత్రం రెవెన్యూ అధికారుల వింత ధోరణి చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో 314 సర్వే నంబర్ ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల కొంత మంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఇది కాస్త రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో శుక్రవారం ఆర్‌ఐ, వీఆర్వో, వీఆర్‌ఏలు సంఘటనా స్థలం చేరుకున్నారు. అక్రమ నిర్మాణాలను పాక్షికంగా తొలగించి మమ అనిపించారు. లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై అధికారులు తీసుకున్న చర్యలు చూసి స్థానికులు నవ్వుకున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో భీమిలి డివిజన్ రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు.

బాల యాచకులు లేని నగరంగా విశాఖ

- చర్యలు చేపట్టాలని సీపీకి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వినతి


సీపీ బాగ్చిని కలిసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అల్లిపురం: విశాఖ నగరాన్ని బాల యాచకులు లేని విధంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టాలని సీపీ శంఖబ్రత బాగ్చిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. ఇటీవల సీపీగా బాధ్యతలు స్వీకరించిన శంఖబ్రత బాగ్చిని శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో వివిధ కూడళ్లలో బాల యాచకులు నిత్యం తారసపడుతూనే ఉన్నారని, ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలన చేయడంతో పాటు వీరి వెనుక ఉండి ప్రోత్సహిస్తున్న వారి వారిపై డేగ కళ్లతో దృష్టిసారించాలన్నారు. బాల్య వివాహాలపై నమోదయ్యే ప్రతీ కేసుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా ఎస్‌హెచ్‌వోలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. బాలల అక్రమ తరలింపుపై రైల్వే అధికారుల సమన్వయంతో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ మేరకు సీపీ స్పందిస్తూ బాలల హక్కుల పరిరక్షణ సంస్థతో కలసి పని చేస్తామని హామీ ఇచ్చినట్లు గొండు సీతారాం తెలిపారు. జిల్లా ప్రొబేషనరీ అధికారి శరత్‌కుమార్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నగర కన్వీనర్ కె.ఎల్లయ్య పాల్గొన్నారు.

న్యాయం చేయాల్సిన పోలీసులే అక్రమ కేసులు పెట్టారు

- దళితసేన నగర అధ్యక్షురాలు సత్యవాణి ఆరోపణ


మాట్లాడుతున్న సత్యవేణి

దాబాగార్డెన్స్: న్యాయం చేయాల్సిన పోలీసులే తమపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని దళితసేన నగర అధ్యక్షురాలు సత్యవాణి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో నా కళ్లెదుటే మైనర్ అయిన తన కుమారుడిని కొడుతుంటే చూడలేక అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే.. నా దుస్తులు ఊడదీసి సభ్య సమాజం తల దించుకునేలా ఐదో పట్టణ పోలీసులు వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయమై దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావుతో కలిసి శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. 'గత నెల 22న నా కుమారుడిని.. తనతో చదువుకున్న అమ్మాయి మా ఇంటి నుంచి తీసుకెళ్లింది. అక్కడకు కొద్ది గంటల్లోనే ఆమె కుటుంబ సభ్యులు నాకు ఫోన్ చేసి అమ్మాయి కనబడటం లేదని సమాచారం ఇచ్చారు. వెంటనే నా కుమారుడికి ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. ఇంట్లో ఉన్న నా తల్లికి ఫోన్ చేస్తే ఆ అమ్మాయి వచ్చి బాబుని తీసుకెళ్లినట్టు చెప్పింది. దీంతో ఐదవ పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించగా అప్పటికే అమ్మాయి మిస్సింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు చెప్పారు. ఇంతలో అమ్మాయి తండ్రి నాకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడటమే గాక, నా కుమారుడిపై కిడ్నాప్ కేసు పెడతానని బెదిరించారు. తర్వాత నాపైన, నా కుమారుడిపైనా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదుతో కేసు పెట్టించారు. తర్వాత మాకు జరిగిన అన్యాయంపై పూర్తి ఆధారాలతో హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో పోలీసు అధికారులపై కేసు నమోదు చేసిన కారణంతో నన్ను, నా కుమారుడిని నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఆ అమ్మాయిని మేమే కిడ్నాప్ చేసినట్టు ఒప్పుకోమని సీఐ బలవంతం చేయడంతో నా కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో పోలీసులు వచ్చి నా కుమారుడి ఎడమ చేయిని పట్టుకుని విరిచారు. నా చేతిలో ఉన్న బ్యాగ్, సెల్‌ఫోన్‌ను ఎస్‌ఐ తీసుకున్నారు. తర్వాత పోలీసులు నాపై దాడికి పాల్పడ్డారు. వైద్యం కోసం కేజీహెచ్‌కు వెళితే అక్కడ వైద్యులు కూడా స్పందించలేదు. ఈ విషయమై నగర పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది' అని ఆమె తెలిపారు. తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టి చట్టాన్ని దుర్వినియోగం చేసిన ఎస్‌ఐ దివ్యభారతి, సీఐ సీహెచ్ ప్రసాద్‌లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నెక్కల నాగమణి, మంగవేణి, ధనలక్ష్మి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల అద్భుతం 'మాయాబజార్'


నాటకంలో రసవత్తర సన్నివేశాలు



మద్దిలపాలెం : రెప్పవేసి తెరిచేలోగా ఎన్నో అద్భుతాలు.. ఘటోత్కచుని అసమాన నటనా కౌశలం... శశిరేఖ అభిమన్యుల పరిణయ కోలాహలం. ఇలాంటి అద్భుత సన్నివేశాలతో సురభి కళాకారులు మాయాబజార్ నాటకంతో ప్రేక్షకులను కట్టిపడేశారు. శుక్రవారం రాత్రి కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన మాయాబజార్ నాటకం ఆద్యంతం ఊ ప్రేక్షకులను అలరించింది. వైరు వర్కుతోనే రంగస్థలంపై మంటలు సృష్టించడం... వర్షం కురిపించడం, వస్తువులను అదృశ్యం చేయడం... ఔరా అనిపించాయి. రంగస్థలంపై సినిమా చూసిన అనుభూతి కలిగించాయి. ఆద్యంతం ప్రేక్షకులు తన్మయత్వానికి లోనయ్యారు. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఈ ప్రదర్శనను వీక్షించేందుకు సినీ నటులు ఆలపాటి లక్ష్మి, రాపేటి అప్పారావు, సముద్రం వెంకటేష్, గాయకులు భూపతి తదితరులు తరలివచ్చారు.